ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 జయశంకర్ భూపాలపల్లి
బుధవారం 17 సెప్టెంబరు 2025



నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన విమోచనోద్యమంలో ఓరుగల్లు పోరుగల్లై అగ్నిజ్వాలలు కురిపించింది. పల్లే పట్నం తేడా లేకుండా సామాన్యులు సమర యోధులై దండు కట్టారు. బానిసత్వం నుంచి విముక్తి కోసం తిరుగులేని పోరు సాగించారు. ప్రాణాలను తృణప్రాయం చేసి స్వేచ్ఛ కోసం తపించారు. సాయుధ రజాకార్లు, నిజాం పోలీసులు ఎంత అణిచివే యడానికి ప్రయత్నించినా, భూస్వామ్య జమీందారి వర్గం, వారి తాబేదార్లు రాచరికానికి బాసటగా నిలిచినా.. ప్రజలు వీరోచిత పోరాటాలు చేశారు. మడమ తిప్పకుండా సాగిన పోరులో ఆస్తులు పోగొట్టుకున్నారు. అవమానాల్ని భరించారు. రజాకార్ల దౌర్జన్యాలకు ఎందరో బలయ్యారు. అనేకమంది ప్రాణత్యాగాలు చేశారు. ఆయుధాలు ధరించారు. జైళ్లలో మగ్గారు. అజ్ఞాతంలోకి వెళ్లారు. చివరకు భారత యూనియన్ సేనల 'ఆపరేషన్ పోలో'తో 1948 సెప్టెంబరు 17న నిజాం పాలన నుంచి తెలంగాణ విముక్తి పొందింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని యేటా సెప్టెంబర్ 17ను విమోచన దినంగా పాటిస్తున్నారు. ఇదే రోజును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా జరుపుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏ పల్లెను తడిమినా నాటి నెత్తుటిగాథలనే వినిపిస్తాయి. నాటి పీడనకు, పోరాటానికి పల్లెల్లో అనేక కట్టడాలు సాక్షీభూతాలుగా కనిపిస్తాయి. అప్పటితరం యోధులు క్రమక్రమంగా కనమరుగుఅవుతున్నా.. మిగిలివున్న వారు చెప్పే జ్ఞాపకాలు శరీరాన్ని నిలువెల్లా భావోద్వేగం ఉప్పొంగేలా చేస్తాయి. నాటి ఘట్టాలను మననం చేసుకొంటూ యోధుల త్యాగాలను కీర్తించే సందర్భమిది....

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ

స్వేచ్ఛ కోసం రక్తతర్పణం

నిజాం పాలన నుంచి విముక్తి కోసం పోరుగల్లుగా మారిన ఓరుగల్లు

- రజాకార్ల దాష్టీకానికి ఎందరో బలి
- ఎదురించి పోరాడిన ప్రజలు
- వీరోచిత పోరాట దీప్తి బైరాన్‌పల్లి
- మరో జలియన్‌వాలా బాగ్ పరకాల
- పెత్తందారులపై సమరశంఖం పూరించిన చాకలి ఐలమ్మ, బందగీ
- ఉద్యమ స్ఫూర్తి దొడ్డికొమురయ్య, బత్తిని మొగిలయ్య
- విమోచన ఉద్యమంలో అగ్రభాగాన మెరిసిన నేల
- నేడు హైదరాబాద్ సంస్థాన విమోచన దినం

7



విద్యుద్దీపాల వెలుగులో ములుగు కలెక్టరేట్



నేడు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

హాజరు కానున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. కలెక్టరేట్ ప్రాంగణంలో వేడుకలు జర గనున్నాయి. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

షెడ్యూల్ ఇలా..

- 9.55గంటలక మంత్రి సీతక్క రాక
- 10 గంటలకు జాతీయపతాకం ఆవిష్కరణ
- 10.5 గంటలకు గౌరవ వందన స్వీకరణ
- 10.10 గంటలకు సీతక్క ప్రసంగం
- 10.20 గంటలకు సంక్షేమ పథకాల పంపిణీ
- 10.30 గంటలకు కార్యక్రమం ముగింపు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



చిట్యాలలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నేతలు

చిట్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా సంఘం నగర కార్యదర్శి ముష్క అజయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.8,300 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని విమర్శించారు. ఈకార్యక్రమంలో సంఘం నేతలు సాయిచరణ్, నాగరాజు, శశివర్ధన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దినసరి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



దినసరి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న దినసరి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, జీవో 64ను వెంటనే రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. అలాగే బాలికల హాస్టల్ ఆవరణలో బాలుర హాస్టల్‌ను తొలగించాలన్నారు. పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన మంగళవారం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగితెలుసుకున్నారు. అందులో పనిచేస్తున్న కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దినసరి కార్మికులు చేస్తున్న సమ్మె న్యాయబద్ధమైనదన్నారు. దీనిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో తాను మాట్లాడానని, సమస్యను పరిష్కరించాలని కోరానని తెలిపారు. జీవో 64 ద్వారా వేతనాలు తగ్గించాలని చూడడం సరికాదన్నారు. దానిని వెంటనే రద్దు చేయాలని అన్నారు. అలాగే ఐటీడీఏ ఏపీవోతో మాట్లాడి విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఉన్న బాలుర హాస్టల్ ఇబ్బందికరంగా మారిందని, దానిని వెంటనే మరో చోటికి మార్చాలని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

'చిన్న కాళేశ్వరం' కెనాల్స్ నిర్మాణంపై అవగాహన



రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్

కాటారం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మళ్లపల్లి, మల్లారం, గూడూరు గ్రామాల్లో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా పంప్‌హౌస్ నుంచి రిజర్వాయర్లను అనుసంధానించేందుకు కెనాల్స్ నిర్మాణంపై రైతులు, ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ నేతృత్వంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు రైతులు, ప్రజలకు ఉన్న అనుమనాలు, అభ్యంతరాలపై చర్చించారు. కెనాల్స్‌ను ఎలా, ఎక్కడెక్కడ నిర్మాణం చేయడం, వాటితో కలిగే ప్రయోజనాలను అధికారులు వివరించారు. కొందరు రైతులు కాల్వల వెడల్పును బాగా తగ్గించాలని కోరగా మరికొందరు రైతులు బహిరంగ మార్కెట్ ధరల ప్రకారం పరిహారమివ్వాలన్నారు. ఇంకొందరు రైతులు నీటి సౌకర్యం ఉండటంతో కాల్వల అవసరం లేదని తెలిపారు. రైతులు లేవనెత్తిన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని సబ్‌కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎస్సైలు శ్రీనివాస్, ఆర్ఐ వెంకన్న, ఇరిగేషన్ ఏఈ వెంకన్న, శిరీష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు భద్రత కల్పించాలి

- నిర్లక్ష్యం వహించిన వార్డెన్లు, వాచ్‌మన్లపై చర్య తీసుకోవాలి
- మోసపు మాటలు చెప్పిన మహిళను అరెస్టు చేయాలి
- మానవ హక్కుల వేదిక నేతలు



విద్యార్థినులు, వార్డెన్‌తో మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక నేతలు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రక్షణ కల్పించకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన హాస్టళ్ల వార్డెన్లు, వాచ్‌మన్లపై చర్య తీసుకోవాలని మానవ హక్కుల వేదిక నేతలు డిమాండ్ చేశారు. విద్యార్థినులను మోసపూరిత మాటలు చెప్పి బయటకు తీసుకెళ్లిన మహిళను అరెస్టు చేయాలన్నారు. 'హాస్టళ్లలో బాలికలకు భద్రత కరువు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు లద్దునూరి యాదగిరి, కార్యదర్శి కర్నాటకపు సమ్మయ్య స్పందించారు. భూపాలపల్లి పట్టణంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను మంగళవారం వారు సందర్శించారు. జరిగిన సంఘటనపై విద్యార్థినులు, వార్డెన్లు, వాచ్‌మన్లతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 12న సాయంత్రం 6.50 గంటలకు రేచల్ అనే మహిళ ఎవరి అనుమతి లేకుండానే హాస్టల్ విద్యార్థినులను బైబిల్ రీడింగ్ ఉందని, వార్డెన్ ముందే చెప్పామని నమ్మబలికి బయటకు తీసుకువెళ్లారని, బీసీ హాస్టల్‌కు లీనా అనే మహిళ వచ్చి మోటివేషన్ తరగతులు ఉన్నాయంటూ వార్డెన్‌కు సమాచారం ఇవ్వకుం డానే వాచ్‌మన్‌కు చెప్పి తీసుకువెళ్లిందని తెలిపారు. గంగారం మోడల్ స్కూల్ నుంచి ముగ్గురు మైనర్లను తమ క్లాస్ టీచర్ సదానందం పేరుతో ఫోన్ చేసి సైన్స్ ఫేర్ ఉందని చెప్పి తీసుకొచ్చి రాత్రి 11గంటల వరకు ఉంచారన్నారు. రకరకాల మోసపూరిత మాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లిన లీనాను వెంటనే అరెస్టు చేయాలని, విధుల పట్ల నిర్ల క్ష్యం వహించిన వార్డెన్లు, వాచ్‌మెన్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. అలాగే క్లాస్ టీచర్‌నని చెప్పి బాలికలను బయటకు తీసుకొచ్చిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని అన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

గోవిందరావుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సకాలంలో రైతులకు యూరియా అందించాలని, వడగండ్ల వానతో నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, రైతులు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ సకాలంలో యూరియా అందకపోవడంతో లక్నవరం ఆయకట్టు పరిధిలోని 15వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిననుందని అన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, వ్యవసాయ అధికారులు స్పందించి రైతులకు యూరియా అందించాలన్నారు. అదేవిధంగా వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతాంగానికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండు రామస్వామి, కాప కోటేశ్వర్‌రావు, క్యాతం సూర్యనారాయణ, కొట్టెం కృష్ణారావు, రెడ్డి పురు షోత్తంరెడ్డి, సామ శ్రీనివాసరెడ్డి, ఏనుగు యాదిరెడ్డి, గుండు లెనిన్, కన్నోజు సదానందం, రైతులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

ఐదు బృందాలను ఏర్పాటు చేసిన ఎస్పీ

కృష్ణకాలనీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలో గంజాయి రవాణాపై పోలీసులు మరింత ఉక్కుపాదం మోపుతున్నారు. ఎస్పీ కిరణ్ ఖరే ప్రత్యేక ప్రణాళికతో ముందడుగు వేశారు. గంజాయి కట్టడికి ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇటీవల మాదక ద్రవ్యాల వినియోగం, వ్యాపారం, సాగు విస్తరిస్తున్న దృష్ట్యా వాటిని అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఐదు టీమ్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి సర్కిల్ పరిధిలో ఒక్కో ప్రత్యేక బృందాన్ని, పట్టణంలోని మరో బృందాన్ని ఏర్పాటు చేశారు.

నైపుణ్య పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నైపుణ్య పోటీలకు దరఖాస్తులు చేసుకోవాలని భూపాలపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్ జుమ్లానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, ఉపాధి కల్పనా శిక్షణ విభాగం ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో 63 రకాల పోటీలు ఉంటాయని తెలిపారు. 16 సంవత్సరాల నుంచి 24 సంవత్సరాల వయస్సు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ పోటీలు జాతీయ స్థాయిలో జరుగుతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. www.skillindiadigital.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించి ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరినిన వివరాలకు ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.



అచ్చం అలాంటివే..

- మార్కెట్‌లో నకిలీ బ్రాండ్ల జోరు
- ఒకట్రెండు అక్షరాల తేడాతో లేబుళ్లు
- గుర్తించలేక మోసపోతున్న వినియోగదారులు
- అరికట్టక చోద్యం చూస్తున్న యంత్రాంగం

ములుగు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నకిలీ బ్రాండ్లతో వ్యాపారం జిల్లాలో జోరుగా సాగుతోంది. విలాసాలకు వినియోగించే వస్తువు లతోపాటు దైనందిన జీవితంలో పేద, మధ్య తరగతి కుటుంబాలు నిత్యం వాడే ఉత్పత్తులను సైతం ఒకట్రెండు అక్షరాల తేడాతో తయారు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రముఖ కంపెనీల ట్రేడ్‌మార్కులను పోలిన పేర్లతో బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అయినా ఈ మాఫియా ఆడుతున్న ఆటలను అరికట్టే వారే కరు వయ్యారని విమర్శలు వస్తున్నాయి. జిల్లా కేంద్రం తోపాటు ఆయా మండలాలు, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ తరహా ఉత్పత్తులు యథేచ్ఛ గా సరఫరా అవుతున్నాయి. నిరక్షరాస్యులే కాకుండా చదువుకున్న వారిని సైతం ఇవి బోల్తాకొట్టిస్తున్నాయి. తినుబండారాలు, పాల ఉత్పత్తులు, వంట నూనె, కొబ్బరి నూనె, వాటర్ బాటిళ్లు, చాక్లెట్లు, సబ్బులు, షాంపూలు, టూత్ పేస్టులు, బ్యాటరీలు, ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ పరికరాలు.. ఇలా అనేక వస్తువులు నకిలీ ట్రేడ్‌మార్కులతో జోరుగా మార్కెట్‌లోకి వస్తున్నాయి. వ్యాపార, వాణిజ్య రంగంలో పర్యవేక్షణ లోపించడం వల్లే ఇలాంటి మోసాలు జరుగుతున్నాయనే ఆరోప ణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

వెనుకబడిన జిల్లాల్లో ఒకటి ములుగు. ఇక్కడ ఆదివాసి, గిరిజన ప్రజలు అధికంగా నివసి స్తుంటారు. వారి అమాయకత్వాన్ని వ్యాపారులు ఆసరాగా చేసుకొని నకిలీ వస్తువులను అంటగడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలోని పలు దుకాణాల్లో అమ్మే కొన్ని సరుకుల్లో నకిలీ ఏదో... అసలు ఏదో గుర్తు పట్టడం కష్టంగా మారింది. వ్యాపారు లు అసలును పోలిన ప్యాకింగ్‌లతో నకిలీ వస్తువులను అమ్ముతుంటే వినియోగ దారులు వాటిని గుర్తించకుండా కొనుగోలు చేసి మోసపోతున్నారు. బ్రాండెడ్ పేరిట నకిలీ వ్యాపారం జరుగుతున్నా సంబంధి త అధికారులు చర్యలు చేపట్టకుండా చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మచ్చుకు కొన్ని ఉదంతాలు

ఇటీవల జిల్లా కేంద్రం ములుగులో ఓ రాజకీయ పార్టీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఓ ప్రజాప్రతినిధికి

(మిగతా 8వ పేజీలో)

నకిలీ లేబుల్‌తో నీళ్ల వ్యాపారం..

ఈ రోజుల్లో మినరల్ వాటర్‌కు ప్రజలు ఎంతలా అలవాటు పడిపోయారంటే.. పక్కనే బోరు, బావి, నీళ్ల అందుబాటులో ఉన్నప్పటికీ దుకాణాల్లో దొరికే ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ కొనుక్కుని తాగే అలవాటు పడ్డారు. దానిని ఆసరాగా చేసుకున్న పలువురు వ్యాపారులు మంచి డిమాండ్ ఉన్న బిస్లరీ, టాటా, కిన్లీ కంపెనీ వాటర్ బాటిళ్లను పోలిన డూప్లికేట్ బాటిళ్లను తయారు చేసి ఒక అక్షరాన్ని అటుఇటుగా రాసేసి లేబుల్ అంటించి అదే ధరకు అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రధానంగా బస్టాండ్‌లలో, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఇలాంటి నకిలీ వాటర్ బాటిళ్లు తారస పడుతుంటాయి. వాటిలో అసలు ఏది.. నకిలీ ఏది? తెలుసుకోవడం చాలా కష్టతరమై వినియోగదారులు మోసపోతున్నారు.

బతుకమ్మకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులు, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, విద్యుత్, ఇరిగేషన్ శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 21 నుంచి అక్టోబరు 2 వరకు జరగనున్న బతుకమ్మ, దసరా వేడులకలపై సమీక్షించారు. బతుకమ్మ వేడుకల నేపథ్యంలో చెరువుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బతుకమ్మ ఘాట్ల వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు బారికేడ్లు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాల న్నారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ పక్కాగా చేయాలన్నారు. 20వ తేదీ వరకే అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, విద్యుత్ ఎస్ఈ మల్హూర్‌నాయక్, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖాన వైద్యుల సంఘం ఎన్నిక


డీఎంహెచ్‌వోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పల్లె దవాఖాన వైద్యులు

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలో పల్లె దవాఖాన వైద్యుల సంఘం ఏర్పాటైంది. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రఘురాం యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా సంధ్య, జి.జ్యోతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాలకృష్ణ ఎన్నికయ్యారు. నూతనంగా కార్యవర్గం డీఎంహెచ్‌వో మధుసూదన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసింది.

పట్టా కావడం లేదని ఆత్మహత్య

అధికారులు, కోర్టుల చుట్టూ తిరిగి వేసారిన రైతు

మనస్తాపంతో బలవన్మరణం

రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరిలో ఘటన


వెంకటయ్య(ఫైల్)

రఘునాథపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తండ్రి పేరు మీద ఉన్న వ్యవసాయ భూమి తన పేరున మార్చు కోవడానికి ఏడేళ్లుగా అధికారులు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో మనస్తాపం చెందిన రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గోవర్ధ నగిరిలో మంగళవారం చోటుచేసుకుంది.

పోలీసుల కథనం ప్రకారం.. గోవర్ధన గిరికి చెందిన ముసిపట్ల వెంకటయ్య (పల్లా)కు కొంరయ్య, వెంకటయ్య(54) ఇద్దరు కుమారులు. తండ్రి వెంకటయ్య (పల్లా)గతంలోనే చనిపోయాడు. తన పేరు మీద ఉన్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిని ఇద్దరి కొడుకులకు ఒక్కొక్క ఎకరం చొప్పున పంచి ఇచ్చాడు. చిన్నకొడుకు వెంకటయ్యకు తన తండ్రి నుంచి వచ్చిన ఎకరం వ్యవసాయ భూమి నుంచి 25 గుంటల భూమి తన పేరుపై పట్టా అయింది. మిగతా 15 గుంటల భూమి కొన్ని సాంకేతిక కారణాలతో తన పేరుపై పట్టా కాకపోవడంతో రెవెన్యూ అధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అనంతరం సమస్య పరిష్కారం కోసం కోర్టును ఆశ్రయించాడు. కోర్టులో సైతం సమస్య పరిష్కారం కాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య రాజమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గోదావరి పుష్కరాలకు సన్నాహాలు

- ఇప్పటికే రూ.200 కోట్లు ప్రకటించిన ప్రభుత్వం
- పనులను గుర్తించి నివేదిక అందించాలని అధికారులకు ఆదేశాలు


కాళేశ్వరం వద్ద గోదావరి


కాళేశ్వరాలయంలోని శ్రీ ముక్తీశ్వరస్వామి

మహదేవపూర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. పుష్కరాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే పలు అభివృద్ధి పనులపై అధికారులను ఆరా తీస్తోంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి గోదావరి పుష్కరాలు నిర్వహించేందుకు కాళేశ్వరం వద్ద త్రివేణి సంగమంలో గోదావరి పుష్కరాలకు రూ.200 కోట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా బాసర నుంచి భద్రాచలం వరకు 700 కిలోమీటర్ల దూరం వరకు గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. అయినా త్రివేణి సంగమం వద్దకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

పనులపై నివేదిక అడిగిన ప్రభుత్వం

త్రివేణి సంగమ గోదావరిలో పుష్కరాలు నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్ల వివరాలు, పనుల ప్రతిపాదనలపై జిల్లా అధికారులను రాష్ట్ర ప్రభుత్వం నివేదిక అడిగింది. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు ఉన్న 17 కిలోమీటర్ల రహదారి వెడల్పు, భక్తుల సౌకర్యాల కోసం కావాల్సిన ఏర్పాట్లు, కాళేశ్వరం బస్టాండ్ నిర్మాణం కోసం ప్లానింగ్, ప్రభుత్వ స్థలం ఉందా.. అది ఎక్కడ కేటాయించాలి? అనే అంశంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రభుత్వానికి నివేదికలు, ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. కొన్ని రోజులుగా స్థలం లేక బస్టాండ్ నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో అతిత్వరలోనే బస్టాండ్ నిర్మాణం ప్రారంభమవుతుందని ఇప్పటికే భూపాలపల్లి ఆర్టీసీ మేనేజర్ ఇందు ప్రకటించారు. కాగా కాళేశ్వరానికి వచ్చే భక్తులకు, ఇతర రాష్ట్రాలకు తరలిపోయే ప్రయాణికులకు ఇది జంక్షన్‌గా మారనుంది.

గోదావరి బైపాస్‌రోడ్డు

గోదావరి బైపాస్ రోడ్డుకు 14 ఎకరాలు సర్వే చేశారు. 30 ఫీట్ల రోడ్డు వెడల్పుతో ఈ రోడ్డు ఏర్పాటు కానుంది. పుష్కరఘాట్ నుంచి సరస్వతి ఘాట్ వరకు, పుష్కరఘాట్ నుంచి బైపాస్ రోడ్డు వరకు ఈ రహదారిని ఏర్పాటు చేశారు. దీంతో పాటు సరస్వతి గద్దె నుంచి పుష్కరఘాట్ నుంచి మెట్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. భక్తుల విడిది కోసం టెంట్లు, డేరాలు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులను ఏర్పాటు చేయనున్నారు.

ఐటీ శాఖ మంత్రి ప్రత్యేక దృష్టి

గోదావరి పుష్కరాలు విజయవంతం చేసేందుకు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి సారించారు. గోదావరి పుష్కరాలకు సంబంధించిన ప్రణాళికలు ఎప్పటికప్పుడు అధికారుల ద్వారా తీసుకుంటున్నారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ సైతం గోదావరి పుష్కరాలపై ఇప్పటికే ముఖ్యమంత్రి, మంత్రులతో సమావేశమైనట్లు తెలిసింది.

రామప్ప ధర్మకర్తల నియామకానికి కసరత్తు

తొమ్మిదేళ్లుగా పాలకవర్గం లేకుండానే ఆలయ నిర్వహణ

తాజాగా 15న నోటిఫికేషన్ జారీ


రామప్ప దేవాలయం

వెంకటాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని రామప్ప రామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల నియామకానికి కసరత్తు ప్రారంభమైంది. ఆసక్తిగల వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరుతూ ఈ నెల 15న రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ నుంచి ప్రకటన వెలువడింది. 20 రోజుల్లోగా దరఖాస్తులను వరంగల్‌లోని దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయానికి పంపాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దీంతో పలువురు ఆసక్తిగా దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

తొమ్మిదేళ్ల ఎదురుచూపు

పాలంపేట గ్రామంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానం పాలకవర్గంలో స్థానం కోసం తొమ్మిదేళ్లుగా పలువురు ఎదురు చూస్తున్నారు. ఎలాంటి కార్యవర్గం లేకుండానే ఇక్కడ శివరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా పాలకవర్గంలో స్థానం కోసం ఆ పార్టీ నేతలు ప్రయత్నించారు. అయినా అప్పటి ప్రభుత్వం పాలకవర్గం నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో గత ఏడాది శివరాత్రి ఉత్సవాల కోసమైనా పాలకవర్గాన్ని నియమిస్తారని ఆ పార్టీ స్థానిక నేతలు ఎదురుచూశారు. అయినా ఆ ఏడాది అలాగే గడిచిపోయింది. తాజాగా ఈ నెల 15న ప్రకటన విడుదల కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. పలువురు నాయకులు ధర్మకర్తల పదవుల కోసం దరఖాస్తులు సమర్పించేందుకు సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. మండలానికి చెందిన నాయకులకే చైర్మన్ పదవి ఇవ్వాలని కూడా పట్టుబట్టే అవకాశం ఉందని సమాచారం. మంత్రి సీతక్క ఆశీస్సులతో స్థానం దక్కించుకునేందుకు ఇప్పటికే పలువురు ప్రయత్నాలను మొదలుపెట్టారని తెలుస్తోంది.


ఆనంద్


సన్నీ


సింధు

షూటింగ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): షూటింగ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు స్టేషన్‌ఘన్‌పూర్, చిలుపూరు మండలాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నెపు కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ఛాగల్‌కు చెందిన యాట ఆనంద్ అనే విద్యార్థితో పాటు చిలుపూరు మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన సన్నీ, సింధు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 22, 23, 24 తేదీలతో మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికుదురు మండల కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అసోసియేషన్ బాధ్యులు అభినందించారు.


మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

మునిసిపల్ కార్మికుడి కుటుంబానికి బీఆర్‌ఎస్ నేతల సాయం

- రూ. 5.50 లక్షల పోస్టల్ బాండ్ల అందజేత

ములుగు రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన మునిసిపల్ కార్మికుడు మహేష్ కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రూ. 5.50 లక్షల పోస్టల్ ఫిక్స్‌డ్ బాండ్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు కాలకులమర్రి లక్ష్మణ్ బాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేష్ కుటుంబాన్ని ఆదుకుంటానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 7న హామీ ఇచ్చారని అన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు తుమ్మ మల్లారెడ్డి, తాటి కృష్ణయ్య, కాకులమర్రి ప్రదీప్‌రావు, సానికొమ్ము ఆదిరెడ్డి, సకినాల భవాని, గై రుద్రమదేవి, దుర్గం రమణయ్య, జంగిలి రవి తేజ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్ రెడ్డి, నాయకులు విజయ్ కుమార్, కుడుముల లక్ష్మీనారాయణ, ఓదేలు, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నష్టం నుంచి లాభాల్లోకి తెస్తున్నాం..

- తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి
- బచ్చన్నపేటలో విజయ డెయిరీ పార్లర్ ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న అమిత్‌రెడ్డి

బచ్చన్నపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నెలకు రూ.10 కోట్ల నష్టంతో నడుస్తున్న విజయ డెయిరీని లాభాల బాట పట్టిస్తున్నామని తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విజయ పాల ఉత్పత్తిదారుల సంఘం ఎదుట డెయిరీ పార్లర్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయ పాల ఉత్పత్తుల్లో రాష్ట్రంలోనే జనగామ నంబర్‌వన్‌గా ఉందని, అందులో బచ్చన్నపేట మొదటి స్థానంలో నిలుస్తుందన్నారు. ఇక్కడ పాల శీతలీకరణ కెపాసిటీని పెంచేందుకు కృషి చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో లాభాల బాట పడుతుందని, గతంలో జరిగిన నష్టాలను పూడ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. రాష్ట్రమంతటా డెయిరీ పార్లర్లు ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గంలోని చెరువులు నింపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో విజయ డెయిరీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, జీఎం మధుసూదన్, మల్లయ్య, డీడీ గోపాల్, స్థానిక చైర్మన్ బొమ్మెన ఆంజనేయులుగౌడ్, డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

మతమార్పిడిలను ప్రోత్సహిస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

అదనపు కలెక్టర్‌కు వీహెచ్‌పీ ఫిర్యాదు


అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో మత మార్పిడి విషబీజాలు నాటుతూ, మతం మారేందుకు ప్రోత్సహిస్తున్న క్రైస్తవ మిషనరీ విద్యాలయాలపై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహనకృష్ణ భార్గవ డిమాండ్ చేశారు. మంగళవారం డీఈవో, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. మోహనకృష్ణ మాట్లాడుతూ జనగామలోని పలు క్రైస్తవ మిషనరీ స్కూళ్లలో జరుగుతున్న మతమార్పిడి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఉదయం ప్రార్థనలో జాతీయ గీతం, దేశభక్తి గేయాలతో పాటుగా క్రీస్తు స్తోత్రాలు చదివిస్తున్నారని, అనంతరం ఆమెన్, ప్రెయిస్ ద లార్డ్, హల్లేలూయా వంటి పదాలు పలికిస్తున్నారని ఆరోపించారు.

అంతేకాదు హిందూ చిన్నారులు బొట్టు పెట్టకూడదని, దేవాలయాలకు వెళ్లకూడదని బోధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు అంబటి బాలరాజు, కుందారపు బైరునాథ్, చిలువేరు హర్షవర్ధన్, ఉల్లెంగుల రాజు, శ్రీనివాస్‌రెడ్డి, మధు, రమేష్, సంపత్, రణధీర్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అటు సమరం.. ఇటు సత్యాగ్రహం

విమోచన పోరులో కాటారం డివిజన్ యోధుల ప్రత్యేక ముద్ర


సిల్వర్ జూబ్లీ స్వాతంత్ర్యానికి గుర్తుగా ఏర్పాటు చేసిన స్థూపం

కాటారం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన పోరులో మంథని నియోజకవర్గంలోని కాటారం డివిజన్ (పూర్వ కరీంనగర్‌జిల్లా) ప్రాంత వాసులు పలువురు సాయుధ, సత్యాగ్రహ దీక్షల ద్వారా స్ఫూర్తిదాయక సంగ్రామంలో పాల్గొన్నారు. నిజాం నిరంకుశపాలన అంతానికై దామెరకుంట, లక్ష్మీపూర్, మహదేవపూర్, సూరారం, మంథని ప్రాంతాలకు చెందిన ఎందరో యోధులు ఉన్న ఊరు, కన్న తల్లి, భార్యాబిడ్డలను వీడి అజ్ఞాత బాట పట్టారు. ప్రస్తుత పెద్దపల్లి జిల్లాలోని మంథనికి చెందిన గులుకోట శ్రీరాములు సాయుధ పోరాటానికి నాయకత్వం వహించగా, రఘునాథ్‌కాచే జిల్లాలో తొలి సత్యాగ్రహవాదిగా నిజాంకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య వంతులు చేయడంలో కీలక భూమిక పోషించారు. వీరి నేతృత్వంలో దామెరకుంటకు చెందిన రాగం వెంకటయ్య, ఐత చిన్న పోచిరెడ్డి, పెద్ద పోచిరెడ్డి, ఐత రాజిరెడ్డి, బాసాని బక్క, రాజయ్య, కొడిపెల్లి వెంకటయ్య, మహదేపూర్‌కు చెందిన శివనాద్రి శంకరయ్య, వెంకటేశ్వర్‌రావు, సూరారానికి చెందిన రామేశ్వర్‌రావులతో సహా పలువురు యోధులు తెలంగాణ విముక్తి పోరులో భాగస్వాములయ్యారు.

రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో మంథనికి చెందిన గులుకోట శ్రీరాములు నేతృత్వంలో దామెరకుంట, మహదేవ్‌పూర్, సూరారం, మంథని ప్రాంతాలకు చెందిన రాగం వెంకటయ్య, చిన్న పోచిరెడ్డి, కొడిపెల్లి వెంకటయ్య, బక్క రాజయ్య, రాజిరెడ్డి, శివనాద్రి శంకరయ్య(కాంగ్రెస్ శంకరయ్య), బిక్కనేని రామేశ్వర్‌రావు, కిషన్‌రావు, ప్రభాకర్, చంటయ్య, రాజన్న, రాంపెల్లి కిష్టయ్య, దామోదర్, నరహరి, సీతారాం తదితరులు సాయుధ పోరాటం చేశారు. స్వామి రామానందతీర్థ పిలుపుతో సత్యాగ్రహ ఉద్యమంలో రఘునాథ్ కాచే ఆధ్వర్యంలో గణపతి, రాజేశ్వర్‌రావు, రాజన్నచారితో సహా పలువురు పాల్గొని నిజాంకు వ్యతిరేకంగా పని చేసి కరీంనగర్, నిజామాబాద్ జైళ్లలో శిక్షను అనుభవించారు. దామెరకుంటకు చెందిన ఐత చిన్న పోచిరెడ్డిని రజాకార్ల సైన్యం ధన్వాడ వద్ద చంపడం విషాదం నింపింది.

చాందాలో శిక్షణ..


శ్రీరాములు బృందం మహారాష్ట్రలోని చాందా (చంద్రాపూర్)లో సాయుధ శిక్షణ పొంది, గోదావరి నది తీరప్రాంతంలో గల గడ్చిరోలి జిల్లా సిరొంచ కేంద్రంగా క్యాంపును ఏర్పాటు చేస్కొని అజ్ఞాతంలో ఉంటూ మంథని, మహదేవపూర్ తాలూకాల్లో నిజాం పోలీస్ అధికారులపై గెరిల్లా దాడులు చేశారు. 1948 సెప్టెంబరు 10న గోదావరినది దాటి వచ్చిన సాయుధ పోరాట వీరులు నిజాం సర్కార్ దామెరకుంట, కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్‌పోస్టులపై, మహదేవపూర్ తాలూకా పోలీస్ అమీన్ కచేరీపై దాడి చేశారు. దామెరకుంటలో కలెక్టర్ పర్యటన సందర్భంగా తహసీల్ హవ్లాలోని అధికారులపై దాడి చేసి చంపిన సంఘటన సంచలనం రేపింది. ఈ దాడుల స్ఫూర్తితో ఈ ప్రాంతాల్లో ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7480	5300
మక్కలు	2059	1521
కందులు	6212	3022
పెసళ్లు	7002	3022
పల్లికాయ (సూక)	6450	3500
పల్లికాయ (పచ్చిది)	3700	2400
పసుపు (కాడి)	10080	7889
పసుపు (గోల)	9656	8996
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16800	12000
యూఎస్341ఏసీ	14500	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం



స్వేచ్ఛ కోసం రక్తతర్పణం

పరకాల మారణ హోమం

తెలంగాణ విమోచనోద్యమంలో పరకాల మారణ హోమం ఒక రక్తసిక్త ఘట్టం. ఇక్కడి ప్రజలు నిజాం వ్యతిరేక ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. సంఘటితమై రజాకార్లకు ఎదురొడ్డి నిలిచారు. జన జాగృతిలో భాగంగా 1947 సెప్టెంబరు 2న తాలూకా కేంద్రమైన పరకాలలో సమావేశం నిర్వహించాలని ఉద్యమ నాయకులు నిర్ణయించారు. ఈ సమావేశానికి వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పరకాల పక్కన పైడిపెల్లి తాటివనంలో జనమంతా పోగయ్యారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావాలంటూ చేసిన నినాదాలు ఆ ప్రాంతమంతా మిన్నంటాయి. అప్పటికే ఒక పోలీసులు, మరో పక్క రజాకార్లు మోహరించారు. ఉద్యమాన్ని మానుకోవాలని పోలీసులు కోరినా ప్రజలు ఊరుకోలేదు. తహసీల్దార్ ఇచ్చిన ఆదేశాల మేరకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఫైరింగ్ ఆర్డర్ ఇవ్వడంతో అప్పటికే కాచుకున్న పోలీసులు విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. మరో పక్క ఇదే అవకాశంగా రజాకార్లు విరుచుకుపడ్డారు. తల్వార్లు, కత్తులు, బరిసెలతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో అనేకమంది ప్రాణాలు విడిచారు. అనేక మంది గాయపడ్డారు. రక్తం ఏరులై పారింది. కాళ్లు, చేతులు తెగిపడ్డాయి. మాంసం ముద్దలతో ఆ ప్రదేశమంతా భయంకరంగా మారింది. మరో జలియన్‌వాలా బాగ్ ఉదంతాన్ని తలపింపచేసింది.

సరిహద్దు శిబిరాలు

నిజాం అండచూసుకున్న రజాకార్లు గ్రామాలను దోపిడీ చేయడం, ఎదురు తిరిగినవాళ్లను క్రూరంగా హింసించి చంపడం, స్త్రీలను చెరచడం, గ్రామాలను తగులబెట్టడం సాగించారు. జిల్లాలో ప్రజలకు రక్షణ లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో ప్రజలు కొందరు పొరుగు రాష్ట్రాలకు పారిపోయారు. మిగిలిన ప్రజల రక్షణ భారాన్ని ఉద్యమకారులు తీసుకున్నారు. అప్పటి పరిస్థితులను బట్టి ఉద్యమాన్ని కొనసాగించే వ్యూహంలో భాగంగా ఉద్యమకారులు సరిహద్దు శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇవి మొదట్లో నైజాం స్టేట్‌లో కాక, ఇండియన్ యూనియన్ భూభాగాలైన చందా (మహారాష్ట్ర). గదక్ (కర్నాటక), విజయవాడ (ఆంధ్ర) మొదలైన ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఒక్కో సరిహద్దు శిబిరానికి ఒక్కో నాయకుడు నాయత్వం వహించారు. విజయవాడలోని సరిహద్దు శిబిరం హయగ్రీవాచారి నాయత్వంలో నడిచింది. ఉద్యమ ప్రచారానికి అవసరమైన పోస్టర్లు, కరపత్రాలు రాత్రుళ్లు రహస్యంగా తెచ్చి గ్రామాల్లో పంచేవారు. రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి మందుగుండు సామగ్రి వచ్చేది.

రజాకార్ల దాష్టీకానికి ఎందరో బలి
విమోచన ఉద్యమంలో అగ్రభాగాన ఉమ్మడి వరంగల్ జిల్లా
నేడు హైదరాబాద్ సంస్థాన విమోచన దినం

నిజాం పాలన నుంచి విముక్తి కోసం వీరోచిత పోరాటం

హనుమకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అలనాటి పాలనలో భూస్వామ్య, జమీందారుల పెత్తనం, అడుగడుగునా నిర్బంధాలు, బలవంతపు వసూళ్లు నిత్యకృత్యంగా సాగేవి. వీటికితోడు రజాకార్ల అకృత్యాలు ప్రజలకు శాపాలుగా మారాయి. వీటిని ఎదురించే దిశగా ప్రజలు చైతన్యవంతులై తమ హక్కులను కాపాడుకునేందుకు పెద్దఎత్తున ఉద్యమించారు. అలా విమోచన ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పోరాటాల గడ్డగా నిలిచింది. విమోచన ఉద్యమ చరిత్రలో తనకంటూ ఒక పేజీని లిఖించుకున్నది. కాకతీయులు ఏలిన గడ్డపై రజాకార్లను ఎదురించిన వ్యక్తిగా బత్తిని మొగిలయ్య గౌడ్ చరిత్రలో నిలిచిపోయారు. బైరాన్‌పల్లి గ్రామం పైపడి ఊరును వల్లకాడు చేశారు. వందమందికి పైగా పొట్టన పెట్టుకున్నారు. రజాకార్లు కూటిగల్ మీద కూడా అదే ప్రతాపాన్ని చూపారు. 18 మందిని నిలబెట్టి రాక్షసంగా కాల్చి చంపారు. పరకాలలో ప్రజాసమూహంపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి అనేక మంది ప్రాణాలు బలిగొన్నారు. రజాకార్ల అండతో చెలరేగిన దొరల దౌర్జన్యాన్ని ఎదురించిన చాకలి ఐలమ్మ ధీరత్వం పలువురికి మార్గదర్శకం చేసింది. పోరాటయోధులు తొర్రూరులో పోలీసు క్యాంపుపై దాడిచేసి దాన్ని లేవనెత్తించారు. కడవెండి, అమ్మాపూర్, నాంచారి మడూరు తదితర ప్రాంతాల్లో సాగిన తెలంగాణ విమోచన ఉద్యమాలు ప్రజల స్వేచ్ఛా పిపాసకు నిలువెత్తు పతాకలు.

బైరాన్‌పల్లి నెత్తుటికథ

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో బైరాన్‌పల్లి ఉదంతం మరువరానిది. బైరాన్‌పల్లి గ్రామస్తులందరూ సమైక్యంగా నిలిచి ధైర్యసాహసాలు ప్రదర్శించి నిజాం సైన్యం బలగాలను, రజాకార్ల రాక్షసకృత్యాలను ఎదురించి పోరాడారు. బైరాన్‌పల్లి పోరాటానికి ఇమ్మడి రాజిరెడ్డి, జగ్గం హనుమంతు, చల్ల నర్సిరెడ్డి, మోటాపోశాలు, తోటరాములు ఇమ్మడి రాంరెడ్డి తదితర పోరాటయోధులు నాయత్వం వహించారు. వీరు గ్రామ ప్రజల సహకారంతో దొరల అకృత్యాలను ఎదురించడమే కాకుండా నిజాం సైన్య బలగాలను,రజాకార్ల దోపిడీలను తిప్పికొట్టారు. ఒక రోజు రజాకార్లు దూలిమిట్ల, లింగాపురం గ్రామాలను దోచుకొని సొమ్మునంతా బండ్లకెత్తుకొని తరలిస్తుండగా బైరాన్‌పల్లి రక్షక దళం రజాకార్లను ఎదిరించి తరిమికొట్టింది. దీంతో బిత్తరపోయిన రజాకార్లు ప్రతీకారేచ్ఛతో రగిలిపోయారు. బైరాన్‌పల్లిపై కక్షతో రజాకార్లు కూటిగల్ గ్రామంలో 20 మందిని కాల్చి చంపారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 12 రోజులకే 1947 ఆగస్టు 27న అర్ధరాత్రి రజాకార్ల మూకలు బైరాన్‌పల్లిని చుట్టుముట్టాయి. బైరాన్‌పల్లి బురుజుపై ఉన్న గస్తీదళ సభ్యులు సైన్యాలను ఎదురించి కాల్పులు జరిపారు. ట్యాంకులు మోగుతున్నాయి. స్టెన్‌గన్‌లు పేలుతున్నాయి. తుపాకీ గుండ్లు దూసుకుపోతున్నాయి. బిత్తరపోయి మేల్కొన్న జనం కకావికలమయ్యారు. బురుజుపై ఉన్న పోరాటవీరులు తమ వద్ద ఉన్న మందుగుండు అయిపోయేంత వరకు సైన్యాన్ని నిలువరించగలిగారు. బురుజు నుంచి కాల్పులు ఆగిపోగానే సైన్యం బలగాలు గ్రామంలోకి ప్రవేశించి మారణహోమాన్ని సృష్టించారు. పారిపోగా మిగిలిన 84 మందిని వరుసగా నిలబెట్టి నిర్దాక్షిణ్యంగా కాల్చిచంపారు. ఆ తర్వాత విమోచనకారులు నిజాంపై, రజాకార్యలపై ఎదురుదాడులకు దిగారు. చాకలి ఐలమ్మ ధీరత్వం పలువురికి మార్గదర్శకంగా నిలిచింది. రజాకార్ల అండతో దొర సాగిస్తున్న దాష్టీకాలను ఐలమ్మ ఎంతో ధైర్యంతో ఎదురించింది. దాడులను లెక్క చేయక మొక్కవోని ధీరత్వంతో పోరాటం సాగించి తన భూమిని కాపాడుకున్నది. దీనిని స్ఫూర్తిగా తీసుకొని ఆనేక చోట్ల పోరాట యోధులు రజాకార్లకు వ్యతిరేకంగా దాడులు సాగించారు. పోరాటయోధులు తొర్రూరులో పోలీసు క్యాంపుపై దాడి చేసి దానిని లేవనెత్తించారు. కడవెండి అమ్మాపూర్, నాంచారి మడూర్‌కు చెందిన అనేకమంది పోరులో పాల్గొన్నారు. జఫర్‌గడ్‌లో, మధిర తాలూకా సిరిపురం గ్రామంలో రజాకార్లు సమరశీలురైన రైతులను కాల్చి చంపారు. 200 మంది రజాకార్లు వచ్చి అల్లిపురం గ్రామాన్ని తగులబెట్టారు. దీనికి ప్రతిగా పోరాటయోధులు రజాకార్లపై ప్రతిదాడి జరిపి ప్రతీకారం తీర్చుకున్నారు.

మొగిలయ్య వీరమరణం

రజాకార్ల దాష్టీకానికి పరాకాష్టంగా నిలుస్తోంది బత్తిని మొగిలయ్య హత్యోదంతం. 1946లో తెలంగాణ విమోచనోద్యమం ఒక పక్క, భారత స్వాతంత్రోద్యమం మరో పక్క ముమ్మరంగా సాగుతున్న రోజులవి. వరంగల్ కోట నివాసి అయిన మొగిలయ్య మొదటి నుంచి విమోచనోద్యమంలో చురుకుగా పాల్గొంటుండేవాడు. ఉద్యమంలో భాగంగా సర్వోదయ సంఘం పక్షాన ప్రతీవారం వరంగల్ కోటలో జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమాన్ని చేపట్టారు. 1946 ఆగస్టు 11న కోటలో జెండా ఎగురువేసిన తర్వాత కాశీంషరీఫ్ నాయత్వంలో రజాకార్లు హఠాత్తుగా దాడి చేశారు. రజాకార్లను ఎదురించే క్రమంలో మొగిలయ్య రజాకార్ల కత్తి పోట్లకు గురై నేలకొరిగాడు.

విముక్తి

క్రమేణా పెరిగిన రజాకార్ల అరాచకత్వం, విశృంఖలత్వం అంతమొందించాల్సిన అవసరం గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. 1948 సెప్టెంబరు 13న పోలీసు చర్యకు ఆదేశించింది. దీని పేరు ఆపరేషన్ పోలో. వరంగల్ జిల్లాలో ఆపరేషన్ పోలో విజయవంతం కావడంలో మామునూరు విమనాశ్రయం ఎంతగానో దోహదపడింది. సైన్యం విమానాల ద్వారా ఈ విమానాశ్రయంలో దిగి అక్కడి నుంచి రజాకార్ల ఏరివేతను మొదలుపెట్టారు. సైనికులు జల్లెడలా విస్తరిస్తూ వెళ్లి రజాకార్లను ఎక్కడికక్కడ అణిచివేశారు. ఇక దిక్కులేని స్థితిలో 1948 సెప్టెంబరు 17న నిజాం రాజు ఉస్మాన్ అలీ ఖాన్ ప్రభుత్వాన్ని శరణుజొచ్చాడు. పోలీసు చర్యతో ప్రజలకు నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించింది. ప్రజలు పూర్తి స్వేచ్ఛా వాయువులను పీల్చుకోగలిగారు. నిజమైన స్వాతంత్ర పోరాట ఫలాలు పొందగలిగారు.

వెన్నుచూపని బందగీ



విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి, ఆయన సతీమణి (ఫైల్)

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ముందే కామారెడ్డిగూడెం షేక్ బంధగీ విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డిని ఎదిరించి తన ప్రాణాలను బలిదానం చేశాడు. తనకు సోదరుల మధ్య జరిగిన భూమి పంచాయితీ రాంచంద్రారెడ్డి వద్దకు వెళ్తే, బందగీ సోదరులకు అతడు అండగా నిలిచాడు. దీంతో బందగీ కోర్టుకు వెళ్లాడు. ఈ కేసులో బందగీకి అనుకూలంగా తీర్పు వస్తుందని గ్రహించిన దేశ్‌ముఖ్ బందగీ సోదరులతో కుట్ర పన్ని హత్య చేయించాడు. బందగీ మరణించినా కేసు న్యాయ పోరాటంలో గెలిచాడు. ఇలాంటి అకృత్యాలెన్నో దేశముఖ్ పరిపాలనలో జరిగాయి.

వీరనారి ఐలమ్మ



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రలో నిలిచిపోయింది.ఈ పోరాటంలో ముందుండి పోరాడింది చాకలి ఐలమ్మ. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడింది. ఆనాడు జరిగిన పోరాటంలో ఆంధ్ర మహాసభ కార్యకర్తలు ఐలమ్మకు అండగా ఉండి ఆ పోరాటానికి ఆజ్యం పోశారు. మల్లంపల్లికి చెందిన మక్తేదార్ కొండల్‌రావు తల్లి జయప్రద దేవి వద్ద ఐలమ్మ కొంత భూమిని కౌలుకు తీసుకుంది. ఆ భూమిని సాగు చేసి పంట పండిస్తుంటే అప్పుడు మొదలైంది. ఐలమ్మకు, విస్నూరు దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డి మధ్య వైరం ప్రారంభమైంది. దేశముఖ్‌ను ఎదిరించిన ఐలమ్మ భూపోరాటం ప్రపంచ స్థాయిలో గుర్తుండి పోయింది. 1945 ప్రారంభంలో జనగామ తాలూకాలో మొట్టమొదటి సారిగా పాలకుర్తిలో ఆంధ్ర మహాసభ ఏర్పాటైంది. ఆంధ్రమహా సభ నాయకులు, కార్యకర్తలు, ఐలమ్మకు అండగా ఉండి రైతాంగ సాయుధ పోరాటానికి నాంధీ పలికారు.

దొడ్డి కొమురయ్య వీర మరణం



తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి మరణం పొందిన వ్యక్తి కడవెండి గ్రామానికి చెందిన దొడ్డి కొమురయ్య. 1946 జూలై 4న దేశ్‌ముఖ్ వ్యతిరేకంగా జరుగుతున్న ప్రదర్శనలో కొంరయ్య ముందు భాగాన నిలిచాడు. గ్రామంలో దేశ్‌ముఖ్ తల్లి జానమ్మ దొరసాని కొడుకు రాంచంద్రారెడ్డి అండతో ప్రజలను అనేక రకాలుగా పీడించింది. దీనికి వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ నాయకత్వంలో కార్యకర్తలు ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. దేశముఖ్ గూండాలు ఆంధ్ర మహాసభ కార్యకర్తలపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో దొడ్డి కొంరయ్య అక్కడికక్కడే మృతి చెందగా మరి కొందరికి గాయాలయ్యాయి. ఈ ఘటన తెలంగాణ సాయుధ పోరాటానికి నాంధీ పలికింది. అప్పటి వరకు శాంతియుతంగా నిర్వహించిన పోరాటాలు, మాణ, ప్రాణాల కోసం భానిసత్వాన్ని విముక్తి పొందేందుకు రజాకర్లు, పోలీస్ బలగాలను ఎదిరించేందుకు ప్రజలు ప్రతిఘటణ పోరాటాలు చేశారు.

విస్నూరు దొర అకృత్యాలు



విస్నూరు గడి

విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి అరాచకాలకు కేంద్ర బిందువే విస్నూరు గడి. ఈ గడి ఆకృత్యాలు, అరచకాలకు నిలయంగా నిలిచింది. దేశ్‌ముఖ్‌కు ఎదురు తిరిగితే రజాకార్లను పంపించి గడిలోని చీకటి గుహాలో వేసి ఆకృత్యాలకు పాల్పడే వారు. చాకలి ఐలమ్మ భూమిలో పండిన పంటను తీసుకురమ్మని రజాకార్లను పంపించింది. దేశ్‌ముఖ్ ఇక్కడి నుంచే ఆదేశాలిచ్చారు. మహిళలను నగ్నంగా ఉంచి బతుకమ్మ ఆడించిన ఘటనను ఇక్కడి ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదు. కమ్యూనిస్టు అగ్ర నాయకుడు బీంరెడ్డి నర్సింహరెడ్డిని తీసుకువచ్చి చెవిలో సీసం పోసి చిత్ర హింసలకు గురి చేసింది ఈ గడిలోనే. ఇప్పటికీ ఈ గడీ చెక్కుచెదరకుండా ఉంది. ఈ గడీ నిర్మాణాన్ని 1940లో ప్రారంభించి 1943లో పూర్తి చేశారు. విస్నూరు చుట్టూ ఉన్న 60గ్రామాల ప్రజల నుంచి బలవంతంగా వసూల్ చేసిన రూ. 2 లక్షల రూపాయలను గడి నిర్మాణానికి ఖర్చు చేశారు.

- ఆంధ్రజ్యోతి, పాలకుర్తి

చరిత్ర మరువని రోజు సెప్టెంబరు 17

తెలంగాణ చరిత్ర మరువని రోజు 1948 సెప్టెంబరు 17. అది నిజాం నిరంకుశత్వం తలవంచిన రోజు. రజాకార్ల ఆగడాలు అంతమైన రోజు. నాటి రెండు కోట్ల మంది తెలంగాణ ప్రజల హృదయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడిన పర్వదినం. ఈ నేలపై త్రివర్ణపతాకం ఎగిరిన రోజు. నిజాం రాచరిక పాలన ముగిసి, హైదరాబాద్ రాజ్యం భారత ప్రభుత్వంలో కలిసిన ఆ రోజు వెనుక అనేక ఘటనలు ఉన్నాయి. అందులో కొన్ని అంశాలు, ప్రముఖుల అభిప్రాయాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..



ఈ ఘట్టానికి ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ చరిత్రలోనే మరచిపోలేని సెప్టెంబరు 17 ఘట్టంలో ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ. 'మజ్లిస్ ఎ ఇత్తేహాద్ ఉల్ ముస్లిమీన్' నాయకుడు. ఆయన స్వస్థలం మరఠ్వాడాలోని ఉస్మానాబాద్ జిల్లా లాతూర్. అలీగఢ్‌లో న్యాయశాస్త్రం అభ్యసించిన అనంతరం హైదరాబాద్‌లో కొంతకాలం వకీలు మహమ్మద్ అలీ ఫాజిల్ దగ్గర సహాయకుడిగా పనిచేశాడు. తర్వాత సొంతూరుకు వెళ్లిన అతను మజ్లిస్ స్థానిక నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు. యావదాస్తిని సంఘానికి రాసిచ్చి నాయకుల మనసులో ప్రత్యేక స్థానం సంపాదించాడు. కొద్దిరోజులకే సంస్థ పగ్గాలు చేపట్టాడు. సమయస్ఫూర్తి, వాగ్ధాటితో సామాన్యులను ఆకట్టుకున్న రజ్వీ నిజాం ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు. రజాకార్ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. హింసాత్మక ఘటనలకు కారకుడయ్యాడు. పోలీసు చర్య అనంతరం రజ్వీని భారత సైన్యం అరెస్టుచేసి తిరుమలగిరి సైనికకారాగారంలో నిర్బంధించింది. 1957, సెప్టెంబరు11న విడుదలయ్యాడు. అదే నెల18న నగరం నుంచి ముంబైకు, అక్కడి నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయాడు. కరాచీలో ఒక అనామకుడిగా జీవనం సాగిస్తూ న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టాడు. ఒకనాడు ఈ నేలను శాసించాలనుకున్న ఇత్తేహాదుల్ సారధి 1970, జనవరి15న ఓ సాధారణ వ్యక్తిగా కన్నుమూశాడు.

భయంతో ఆస్తులమ్మారు



పోలీసు యాక్షన్‌కు వారం ముందు 'బక్రీదుకు గొర్రెలను కాదు, హిందువుల తలలు నరుకుతాం. వాళ్ల రక్తంతో హోలి ఆడతాం' అని రజాకార్ నాయకుడు ఖాసీం రజ్వీ ప్రకటించినట్లుగా నగరమంతా వదంతులు వ్యాపించాయి. దాంతో హిందువులంతా భయంతో ఆస్తిపాస్తులు అమ్ముకొని బతికినన్నాళ్లు అయినా ఆనందంగా జీవించాలని విందులు చేసుకున్నారు. అదే సమయంలో భారత సైన్యం ప్రవేసించడంతో నిజాం లొంగిపోయాడని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. యుద్ధ ట్యాంకులు, వాహనాలకు పూలమాలలు వేసి, భారత జవానులకు లడ్డూలు తినిపిస్తూ సంబురాలు చేసుకున్నారు. ముస్లింలంతా రజాకార్లు కాదు. ఆ సమయంలో రజాకార్ల దాడినుంచి ఎంతోమంది హిందువులను ముస్లింలు కాపాడారు. ఈ విషయాలన్నీ ప్రత్యక్ష సాక్షి మా అక్కచెప్పగా నాకు తెలిశాయి.

- పరవస్తు లోకేశ్వర్, నగర చరిత్ర పరిశోధకుడు

పోరాట చరిత్రను వక్రీకరించద్దు



నిజాం వ్యతిరేక, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రతో సంబంధం లేని వాళ్ల విమోచనం అంటూ రాద్ధాంతం చేయడం సరికాదు. ఆ మహత్తర పోరాటంలో ప్రాణాలకు తెగించి మరీ పోరాడిన మేమంతా బతికుండగానే ఈ నేల చరిత్రను వక్రీకరిస్తున్నారు. త్యాగాలను అవమానిస్తున్నారు. కొత్త రాజకీయ ఎత్తుగడలో భాగంగానే వాళ్ల నాలుగేళ్లగా విమోచనం పాటెత్తుకున్నారు. ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టుల సాయుధ పోరాటం వల్లే హైదరాబాద్ సంస్థానం భారత ప్రభుత్వంలో విలీనమైందనేది వాస్తవం.


- కందిమళ్ల ప్రతాపరెడ్డి, కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్


కమ్యూనిస్టులకు ఆయుధాలు అందించా



నాది భూస్వామ్య కుటుంబమే అయినా, నిజాం వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నాను. అప్పట్లో హెచ్ఎస్‌సీ ప్రీ ఫైనల్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులనే వార్షిక పరీక్షలకు పంపేవారు. దీనికి వ్యతిరేకంగా ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ పెద్ద ఉద్యమమే లేవనెత్తింది. అందులో నేనూ పాల్గొన్నాను. అలా మగ్దూం, జావెద్ రజ్వీ, సీహెచ్ రాజేశ్వరరావు, రాజ్‌బహదూర్ గౌర్ లాంటి కమ్యూనిస్టు నాయకులతో పరిచయం ఏర్పడింది. నిజాం వ్యతిరేక పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులకు ఎన్నో సార్లు మందుగుండు సామాగ్రి, తుపాకీలు లాంటి ఆయుధాలు రహస్యంగా అందించాను. కొన్నాళ్లు రహస్య జీవితం గడిపాను. కమ్యూనిస్టు పార్టీ చైతన్యంతో వారసత్వంగా వచ్చిన వందల ఎకరాల భూమిని పంచాను.

- మొహ్మద్ ఖాజా మొయినుద్దీన్, నిజాం వ్యతిరేక పోరాటయోధుడు, 99ఏళ్లు






నిజాం ప్రధానిమీదా రజాకార్ల దాడి

నిజాం నిరంకుశ పాలనలో సామాన్యుల మానప్రాణాలను హరించిన రజాకార్లు నిజాం ప్రధాని మీదా దాడి చేయడం కొంత మందికే తెలుసు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఓ ఆస్పత్రి ఆవరణలో తలెత్తిన ఘర్షణలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలన్న కాంక్షతో కొంతమంది రజాకార్లు ఆనాటి ప్రధాని అధికారిక నివాసం షా మంజిల్(ప్రస్తుతం రాజ్‌భవన్)ను ముట్టడించారు. లోపల గృహోపకరణాలకు నిప్పుపెట్టారు. అంతటితో ఆగక ప్రధానమంత్రిపై సైతం దాడికి పాల్పడ్డారని మందుముల నరసింహారావు జ్ఞాపకాల్లో ప్రస్తావించారు.

దక్కన్ రేడియోలో స్వాతంత్ర్య ప్రకటన

భారత ఆర్మీ 1948, సెప్టెంబరు18న నగరానికి చేరింది. అంతకు ఒకరోజు ముందు రోజు సెప్టెంబర్17న ఖాసీం రజ్వీ హైదరాబాద్‌లో నరమేధానికి వ్యూహం పన్నాడు. ఈ విషయం తెలిసి ఉస్మానాబాద్ కలెక్టర్ మొహమ్మద్ హైదర్ ఆనాటి నిజాం పోలీసు ఉన్నతాధికారి నవాజ్ దీన్‌యార్‌జంగ్ దగ్గరకు పరుగుతీశాడు. ఇరువురు ఫోన్‌ద్వారా రజ్వీకి నచ్చజెప్పి కల్లోలాన్ని ఆపించారు. ఈ విషయాన్ని మొహమ్మద్ హైదర్ జ్ఞాపకాల్లో రాశారు. అంతకు ముందురోజే సైన్యాధ్యక్షుడు ఎల్.ఇద్రూస్ నిజాంను కలిసి సైన్యాన్ని ప్రతిఘటించడం వల్ల మరింత ప్రాణ నష్టం మినహా మరేమీ లేదని విన్నవించాడు. దీంతో సెప్టెంబరు17న మొదట ఖాసీం రజ్వీ ఖైరతాబాద్‌లోని దక్కన్ రేడియో ద్వారా తన ఓటమిని అంగీకరించాడు. ఆ తర్వాత కేఎం మున్షీతో కలిసి దక్కన్ రేడియోకు చేరుకున్న నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్.. భారత సైన్యాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొన్ని వందల ఏళ్ల రాచరిక పాలన నుంచి ఈ నేలకు స్వాతంత్ర్యం సిద్ధించింది. ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంబురాలు చేసుకున్నారు. నగర వీధుల్లో జాతీయ జెండా ఎగరేశారు.



పోషణ అవగాహన ర్యాలీలు నిర్వహించాలి

కలెక్టర్ టీఎస్.దివాకర

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి అక్టోబరు 16వ తేదీవరకు నెలరోజుల పాటు జిల్లాలోని ప్రతి గ్రామంలో పోషణ అవగాహన ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ టీఎస్.దివాకర సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో మెడికల్ అండ్ హెల్త్, పంచాయతీరాజ్, విద్యాశాఖ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ ర్యాలీలు, ఆరోగ్యపరీక్షలు, బీఎంఐ పరీక్షలు నిర్వహించాలని, గర్భిణులు, చిన్నారులకు ఐరన్ పోలిక్‌యాసిడ్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. స్థానిక విద్యార్థులు, మహిళా సంఘాలు, సర్వే సభ్యుల ద్వారా ప్రజల్లో పోషణపై అవగాహన కల్పించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పోషకాహారానికి సంబంధించిన సలహాలు అందించాలని సూచించారు. నెలరోజులపాటు పోషణ గురువులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి వివిధ కార్య క్రమాలు, వంటల పోటీలు, పోషకాహార ప్రదర్శనలు, పాలు, పండ్లు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోలు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

మేడిగడ్డ బ్యారేజీలోకి 5.66 లక్షల క్యూసెక్కులు

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 5.66 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.60మీటర్లు ఉంది.

తగ్గుముఖం పట్టిన గోదావరి

కన్నాయిగూడెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. సోమవారం వరకు పెరుగుతూ వచ్చిన గోదావరి మంగళవారం ఉదయం నుంచి తగ్గుముఖం పట్టి ప్రవహిస్తూ ఉంది. ఎగువ నుంచి 5,13,540 క్యూ సెక్కుల ఇన్ ఫ్లో వస్తుండడంతో బ్యారేజీలోని మొత్తం 59 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. బ్యారేజీని ఫ్రీ ఫ్లోగా ఉంచారు. బ్యారేజీ వద్ద 80.00 మీటర్ల నీటి మట్టం నమోదయింది.

బతుకమ్మ స్థలాలను పరిశీలించిన మునిసిపల్ కమిషనర్



బతుకమ్మ స్థలాన్ని పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): బతుకమ్మ స్థలాలను మంగళవారం మునిసిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పీఆర్ పల్లి, మహబూబ్‌పల్లి, భాస్కర్‌గడ్డ, వేశాలపల్లిలో స్థలాలను పరిశీలించారు. అనంతరం ఆయా స్థలాలను చదునుచేయాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ రజనీకర్, మునిసిపల్ టెక్నికల్ అధికారి మానస, సానిటరి ఇన్స్‌పెక్టర్ నవీన్ తదితరులు ఉన్నారు.

మా సంఘాన్ని విమర్శించే అర్హత ఐఎన్‌టీయూసీకి లేదు

ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి రమేష్



మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి రమేష్

కృష్ణకాలనీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీని విమర్శించే అర్హత ఐఎన్‌టీయూసీకి లేదని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్ విమర్శించారు. మంగళ వారం ఏరియా పరిధిలోని 6ఇన్‌క్లైన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి చరిత్రలో కారికుల హక్కుల కోసం అనునిత్యం పోరాటం చేస్తూన్న సంఘం ఏఐటీయూసీ అన్నారు. ఈ నెల 22న లాభాల బోనస్ గురించి మాట్లాడే విషయంలో కనీసం ఆహ్వానం లేని ఐఎన్‌టీయూసీ సంఘం విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. ఈ నెల 19న జీఎం కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను అధిక సంఖ్యలో పాల్గొని కార్మికులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, నూకల చంద్రమౌళి, కృష్ణమూర్తి, రాజన్న, టీఎల్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దినసరి కార్మికులకు వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్

ఏటూరునాగారం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డెయిలీ వేజ్ కార్మికుల ఆరు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే కలెక్టర్ గెజిట్ ప్రకారం చెల్లించాలని సీఐటీయూ ములుగు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ డిమాండ్ చేశారు. యూనియన్స్ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఐటీడీఏ ఎదుట నిరవధిక సమ్మె మంగళవారంతో ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా రాజేందర్ హాజరై మాట్లాడారు. వేతనాలు తగ్గిస్తూ ఇచ్చిన జీవో నెంబర్ 64ను వెంటనే రద్దు చేయాలని, ఐదు రోజులుగా కార్మికులు నిరసన చేస్తుంటే ఒకవైపు హాస్టల్‌లో పిల్లలు వంటలు చేస్తున్న కూడా ప్రభుత్వం ఇప్పటివరకు సమ్మెకు పరిష్కరించడం లేదన్నారు. ఏ ప్రభుత్వమైనా వేతనాలు పెంచుతుందని కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వేతనాలు తగ్గించే విధంగా నిర్ణయాలు చేసి గిరిజన కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. రూ. 10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం, రూ. 5 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, అంత్యక్రియల ఖర్చు రూ.50 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ.దావూద్, హాస్టల్ వర్కర్లు నాగలక్ష్మి, జయలక్ష్మి, భాగ్యలక్ష్మి, కమలతో పాటు సుమారు 150 మంది కార్మికులు పాల్గొన్నారు.

పోషణతోపాటు విద్య అవసరం : సీడీపీవో

ఏటూరునాగారం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పిల్లలకుపాటు విద్య కూడా అవసరమని ఏటూరునాగారం ఐసీడీఎస్ ప్రాజెక్ట సీడీపీవో ప్రేమలత అన్నారు. మంగళవారం ఏటూరునాగారం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్ పడాయీ భీ శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులు మూడు రోజుల పాటు కొనసాగ నున్నా యి. మండల కేంద్రంలోని గిరిజనభవన్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో సీడీపీవో ప్రేమలత హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విద్య, పుష్పావతి, వసంత, విజయలక్ష్మి, విజయ కుమారి, బ్లాక్ కో-ఆర్డినేటర్ డి. ఇమ్మానుయేల్‌తో పాటు ప్రాజెక్ట్ పరిధిలోని మూడు మండలాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

- మంగపేట (ఆంధ్రజ్యోతి) : పుట్టిన ప్రతీ బిడ్డకు పోషణతో పాటు చదువు కూడా అంత అవసరమని ఏటూరునాగారం ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీవో ఈ. పి.ప్రేమలత అన్నారు. మంగళవారం మంగపేట రైతు వేదిక భవనంలో పోషణ్ భీ పడాయి శిక్షణా తరగతులను రెండు విభాగాలుగా అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణా తరగతులు ప్రారంభించి సీడీపీవో మాట్లాడారు. బాల్యదశలోనే బిడ్డకు పోషణ అవసరమన్నారు. ఏసీడీపీవో కల్పన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీవిద్య, పుష్పలత, వసంత, విజయలక్ష్మి, విజయకుమారి, బ్లాక్ కో-ఆర్డినేటర్ డి. ఇమ్మానూయేల్‌లతో మూడు మండలాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్యశిబిరం

వెంకటాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరభద్రవరం ఆరోగ్య మహిళా కేంద్రంలో మంగళవారం వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ అజ్మీరాజ్యోతి 89 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పదిమంది వద్ద నుంచి రక్తనమూనాలు సేకరించారు. అనంతరం సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది యాకలక్ష్మి, శాంత పాల్గొన్నారు.

గంగారంలో తీజ్ ఉత్సవాలు ప్రారంభం



తీజ్ ఉత్సవంలో మహిళలు, యువతులు

కాటారం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):మండలంలోని గంగారం గ్రామంలో బంజారాల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిరూపమైన తీజ్ ఉత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరిగింది. తండా వాసులు తీజ్ ఉత్సవాల్లో భాగంగా పాడిపంట, పిల్ల జెల్లా బాగుండాలని కోరుతూ గ్రామశివారులోని పంట చేల మధ్య శీత్లా భవాని పండుగ వేడుకలను ఘనంగా జరుపున్నారు. లంబాడా సేవా సంఘం నాయకులు, తండా పెద్దలు, మహిళలు, యువతు లు డప్పు చప్పుళ్ల మధ్య బోనాలతో వెళ్లి శీత్లా భవానిని మొక్కుకుని యాటలను బలిచ్చి పశువులను దాటిచ్చే కార్యక్రమం చేపట్టారు. బుధవారం యువతులతో మేదరి బుట్టల్లో గోధుమలు, మట్టిని వేసి తొమ్మిదిరోజుల పాటు నీళ్లు పోస్తూ డప్పుచప్పుళ్లతో సాంప్రదాయ నృత్యాలతో తీజ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటామని తండా పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తండా నాయకులు అజ్మీరా రాజునాయక్, భూక్యా రాజ్‌కుమార్, లావిడియా రమేష్‌నాయక్, బాలాజీనాయక్, సమ్మయ్యనాయక్, రఘు, స్వామి, రెడ్డినాయక్, లక్ష్మణ్, సారయ్య, పలువురు మహిళలు, యువతులు తదితరులు పాల్గొన్నారు.

19న జోనల్‌స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19వతేదీన మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జోనల్ ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించనున్నట్లు జోనల్ ఛైర్మన్, మండల విద్యా శాఖ అధికారి లింగాల కుమారస్వామి, జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుండెల్లి రాజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలను కలిపి మొగుళ్లపల్లిలో జరిగే జోనల్‌స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అండర్-14,17 బాలబాలికలకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడల్లో 450మంది విద్యార్థులు పాల్గొననున్నారని పేర్కొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురం, మొగుళ్లపల్లి, కొర్కిశాల గ్రామంలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, ఎంఈవో కార్యాలయాన్ని మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ తనిఖీ చేశారు. ముందుగా ఆయన పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్లు, పలు రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి యూడైస్‌లో నమోదై ఉండాలని, ఎఫ్ఆర్ఎస్ మొబైల్ యాప్ ద్వారా ప్రతి విద్యార్థి అటెండెన్స్ నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. తరగతిగది బోధనలో ఎఫ్ఎల్ఎస్, ఎల్ఐపీ అమలును పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం అమలుతీరును పరిశీలించి భోజన తయారీలో పలు జాగ్రత్తలు తీసుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. ఆయన వెంట జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ దుప్పటి రాజగోపాల్, ఎంఈవో లింగాల కుమారస్వామి, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ కిషన్‌రెడ్డి ఉన్నారు.

18న బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

కాటారం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని కాటారం డివిజన్ కేంద్రంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర నేత చల్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో రక్తదాన శిబిరం జరుగుతుందని వెల్లడించారు. ఈ శిబిరాన్ని బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, రాష్ట్ర నేత చల్ల నారాయణరెడ్డి ప్రారంభిస్తారన్నారు. డివిజన్‌లోని ఐదు మండలాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని రంజిత్ కోరారు.

100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కాటారం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కాటారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రగుంటపల్లిలో లో వోల్టేజ్ సమస్య పరిష్కారం కోసం ట్రాన్స్‌కో అధికారులు చర్యలు చేపట్టారు. సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు 100కేవీఏ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో సీఈ రాజుచౌహాన్, ఎస్ఈ మల్సూర్‌నాయక్ నేతృత్వంలో అధికారులు బిగించి ప్రారంభించారు. లో వోల్టేజీ సమస్యలు ఉన్నచోట సామర్థ్యం పెంపుదలతో నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు సీఈ వెల్లడించారు. తమ సమస్యను పరిష్కరించిన ట్రాన్స్‌కో అధికారులను గ్రామస్తులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు పాపిరెడ్డి, సదానందం, ఏడీఈ నాగరాజు, ఏఈ ఉపేందర్, ఎల్ఐ కిరణ్‌కాంత్, లైన్‌మెన్ చంద్రమౌళి, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు సహించం

పుట్ట మధు వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణుల నిరసన



పుట్ట మధు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కాటారం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ స్పీకర్ శ్రీపాద రావుపై అసత్య ఆరోపణలు చేస్తే మాజీ ఎమ్మెల్యే పుట్ట మధును రాబోయే రోజుల్లో ప్రజలే రాజకీయ సమాధి చేస్తారని ఐదు మండలాల మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీలు, కాంగ్రెస్ మహిళా నేతలు ధ్వజమెత్తారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు దిష్టిబొమ్మను కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, ఏఎంసీ ఛైర్ పర్సన్ పంతకాని తిరుమల, డీసీసీ ప్రధాన కార్యదర్శి కుంభం స్వప్న ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సంద ర్భంగా మహేశ్వరి, తిరుమల, స్వప్న, మహదేవపూర్ మాజీ ఎంపీ పీలు రాణిబాయి, సత్యమ్మ, మహదేవపూర్, మల్హర్, మహాముత్తారం మాజీ జడ్పీటీసీలు గుడాల అరుణ, కొండ రాజమ్మ, లింగమల్ల శారద తదితరులు మాటాడుతూ రాజకీయంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఎదుర్కోలేక దివంగత అసెంబ్లీ మాజీ స్పీకర్ శ్రీపాద రావుపై నిందలు వేయడం పుట్ట మధు వ్యక్తిత్వానికి నిదర్శన మన్నారు. మధు బహుజనవాదాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తూ దళిత, బహుజనులకు తీవ్ర అన్యాయం చేసింది ప్రజలకు తెలుసన్నారు లాయర్ వామన్‌రావు దంపతుల హత్యపై సీబీఐ విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో మధుకు మతిభ్రమించి అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు రమేష్, నాయకులు బడితెల రాజయ్య, దేవేందర్‌రెడ్డి, మహేష్, రఘురాం, చంద్రమౌళి, భూపెల్లి రాజు, భాస్కర్, రామ్మోహన్‌రావు, ప్రభుదాస్, రాజబాపు, కిరణ్, ఉంసింగ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- మహదేవపూర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : పుట్ట మధు వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీనుబాబు, దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, పీఏసీఎస్ చైర్మన్ సల్ల తిరుపతయ్య, మండలాధ్యక్షుడు అక్బర్‌ఖాన్, మాజీ ఎంపీటీసీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చం అలాంటివే..

(5వ పేజీ తరువాయి)

కార్యకర్తలు వాటర్ బాటిల్ అందించారు. నీళ్లు తాగిన ఆయన దాని లేబుల్ చూసి కంగుతిన్నారు. 'బిస్లరీ' స్థానంలో 'బైల్‌సరి' అని రాసి ఉంది. 'ఇదేమిటయ్యా.. ఇలా ఉంది?' అని ఆయన పార్టీ కార్యకర్తలను అడగ్గా బిక్కముఖం వేసుకోవడం వారి వంతైంది.

అలాగే ఇటీవల ములుగులో ఓ వ్యక్తి చిన్న బ్యాటరీలు (సెల్స్) కొనుగోలు చేశాడు. ఎప్పుడు వాడే బ్రాండెడ్ కంపెనీ 'డ్యూరాసెల్' ఇవ్వమని షాపు నిర్వాహకుడిని అడగ్గా, 'డ్యూరోసెల్' పేరుతో ఒక అక్షరం తేడా ఉన్న బ్యాటరీలు అంటగట్టాడు. వాటిని ఇంటికి తీసుకెళ్లాక అవి నకిలీవి అని అతడి కుమారుడు గుర్తించాడు. విద్యావంతుడైనప్పటికీ అసలుకు పోలి ఉండటంతో ఆ వ్యక్తి నకిలీ బ్యాటరీలను గుర్తించలేక కొనుగోలు చేశాడు. ఇదేమిటని షాపు వద్దకు వెళ్లి అడగ్గా తనకేం తెలియదని, హోల్‌సేల్ మార్కెట్ నుంచే అలా వచ్చాయని వ్యాపారి బుకాయించాడు.

ఇదే క్రమంలో మంగపేటలో ఓ వ్యక్తి తన పిల్లల కోసం కిరాణా షాపులో చాకెట్లు కొన్నాడు. పిల్లల కోరిక మేరకు 'కిట్‌కాట్' చాక్లెట్లు ఇవ్వమని అడగ్గా వ్యాపారి 'టిక్‌టాక్' పేరుతో ఉన్నవి అంటగట్టాడు. కొద్ది సేపటికే ఆ వ్యక్తి గుర్తించి 'ఇదేమిటి.. ఇవి నకిలీవి కదా?' అని వ్యాపారిని నిలదీయగా 'మా దగ్గర ఉన్నవి ఇవే.. కొంటే కొను లేదంటే మానుకో' అని అతడు దురుసుగా మాట్లాడాడని తెలిసింది.

ఇలా అనేక ఘటనలు ఉన్నప్పటికీ కొన్ని మాత్రమే చర్చకు వస్తున్నాయి. అసలువి అనే భ్రమతో నకిలీవిని గుర్తించక మోసపోయే వారు కోకొల్లలని తెలుస్తోంది.

జాగ్రత్తలు పాటించకుంటే మోసమే..

ఏదైనా వస్తువు కొనుగోలు చేసే ముందు ఒకటికి రెండు సార్లు పరిశీలించడం మంచిదని అంటున్నారు వినియోగదారుల సంఘాల ప్రతినిధులు. ఏదైనా వస్తువు నకిలీదని గుర్తిస్తే వెంటనే వినియోగదారుల మండలి (కన్స్యూమర్ ఫోరం)లో ఫిర్యాదు చేయాలని అంటున్నారు. అయితే.. ఈ నకిలీ ఉత్పత్తుల వ్యాపారాన్ని అడ్డుకట్ట వేయడానికి ప్రత్యేక విభాగం ఉన్నప్పటికీ జిల్లా యంత్రాంగం దృష్టిసారించకపోవడం సరికాదని అభిప్రాయపడుతున్నారు.

కాళేశ్వరంలో గోకులాష్టమి వేడుకలు

మహదేవపూర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీరామాలయంలో సోమవారం రాత్రి విశిష్ట పూజలు, భగవత అంతర్గత శ్రీకృష్ణ జనన ఘట్టము పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేపట్టిన అధికారులు మంగళవారం ఉద యం కాళేశ్వర పురవీధుల్లో ఉత్సవ విగ్రహానికి ఊరేగింపు చేశారు. అనం తరం ఆలయ ఆవరణలో ఉట్టికొట్టి వేడుకలు చేశారు. ఈకార్యక్రమంలో ఈవో మహేష్, ఆలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

హేమాచల క్షేత్రంలో శ్రీకృష్ణాష్టమి

మంగపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మల్లూరు హేమాచల కొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచు లక్ష్మి సమేత లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఆవరణంలో మంగళవారం పాంచరాత్ర ఆగమం ప్రకారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గ్రామ యాదవ కులస్థులు ఉట్టికొట్టే కార్యక్రమానికి ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆర్. మహేష్ ఆధ్వర్యంలో దేవస్థానంలోని ఉప దేవాలయమైన శ్రీ వేణుగోపాలస్వామి మూలవిరాట్‌కు అర్చకులు పలురకాల అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రప్రకారంగా ముందుగా నిర్వహించారు. చిన్నారులను సుందరంగా అలంకరించి ఉటి కొట్టే కార్యక్రమాన్ని భక్తుల ఆనందోత్సవాల మధ్య వైభవంగా నిర్వహించారు.

వెంకటాపూర్‌లో..

వెంకటాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎండోమెంట్ అధికారులు, జిల్లాపరిషత్ పాఠశాల సమీపంలో జాగర శివాజీ, శాంతమూర్తిల ఆధ్వర్యంలో వేడుకలను వైష్ణవ సంప్రదాయ ప్రకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం మండలకేంద్రంలో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మల్హర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లెంకుంట గ్రామానికి చెందిన ఓదెలు ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంగళవారం పరామర్శించారు. అలాగే గ్రామానికి చెందిన లక్ష్మీరాజం అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఏటూరునాగారం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం 163వ జాతీయ రహదారిపై మూడో బ్రిడ్జి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమా దంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం గ్రామా నికి చెందిన రాకేష్, మహేష్ ఒక బైక్‌పై ఏటూరునాగారం వైపునకు వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన కిరణ్, విష్ణు మరో ద్విచక్రవాహనంపై ఏటూరునాగారం నుంచి లక్ష్మీపురం వైపు బయల్దేరారు. లారీ అడ్డు రావడంతో దానిని తప్పించే క్రమంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాకేష్, మహేష్, కిరణ్‌కు కాళ్లు విరిగిపోయాయి. మరో వ్యక్తి విష్ణుకు స్వల్ప గాయాల య్యాయి. దీంతో స్థానికులు క్షతగాత్రులను సామా జిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో

వెంకటాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డీఈవో సిద్ధార్థరెడ్డి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు.ఎఫ్ఆర్ఎస్ అమలుతీరు, మధ్యాహ్న భోజనం పంపిణీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు, టీచర్ డైరీలు, బేస్‌లైన్, ఫార్మాటివ్ అసెస్‌మెంట్ ఫలితాల వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. పదోతరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల్లో గణిత సామర్థ్యాలను పరీక్షించారు. ఆయన వెంట సమగ్రశిక్ష కో ఆర్డినేటర్ గుల్లపెల్లి సాంబయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధిక, ఉపాధ్యాయులు బాబూరావు, అంబేద్కర్, సంధ్యారాణి, కిషోర్‌బాబు, మహేష్ ఉన్నారు.

ఏవైఎస్ ఆవిర్భావ వేడుకలు విజయవంతం చేయాలి

టేకుమట్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న హనుమకొండలో, 26న భూపాలపల్లి జిల్లాలో జరిగే అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు పుల్ల మల్లయ్య కోరారు. మండల కేంద్రంలో ఈ మేరకు మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గడ్డం సదానందం, అరకొండ రాజయ్య, ఆకునూరి జగన్, ఆకునూరి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యశిభిరంలో పాల్గొన్న భద్రాచలం ఐటీడీఏ అడిషనల్ డీఎంహెచ్‌వో

వాజేడు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో మండలంలోని జగన్నాథపురంలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఐటీడీఏ పీవో రాహుల్ ఆదేశాల మేరకు వాజేడు వైద్యాధికారులు జగన్నాథపురంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఏటూరునాగారం ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు కోరం క్రాంతి కుమార్ ప్రారంభించారు. భద్రాచలం ఐటీడీఏ అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు వైద్య శిబిరాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. వైద్య శిబిరాన్ని చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం ఓపీ 561 మంది పరీక్షించుకున్నారు. ఇందులో చిన్నపిల్లలు 82, జనరల్ 390, గైనకాలజిస్ట్ 30, కంటి పరీక్షలకు 50 మందిని పరీక్షించారు. ఈ శిబిరంలో వైద్యులు మనోజ్‌లాల్, రిదిమా, రవితేజ, మహేందర్, మధుకర్, జ్ఞానస, హెచ్ఈవో కోటిరెడ్డి, హెచ్‌వీ వెంకటరమణ, ఫార్మసిస్ట్ రఘు, హెచ్ఏ చిన్నవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంల ముందస్తు అరెస్టు

వెంకటాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ముట్టడికి యత్నించిన రెండో ఏఎన్ఎంలను స్థానిక పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రెండో ఏఎన్ఎంలు మాట్లాడుతూ 16 ఏళ్ల నుంచి కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతున్నా తమను ప్రభుత్వం పట్టిం చుకోవడం లేదని అన్నారు. తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో రెండో ఏఎన్ఎంలు కనకలక్ష్మి, సుశీల, రజిత, స్వప్న, కల్పన, స్వర్ణలత, వజ్ర ఉన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన

ములుగు రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బాలయ్య అధ్యక్షతన మంగళవారం ఓజోన్ పొర ప్రాముఖ్యత, పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భం గా అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా రసాయన శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ విజిత ఓజోన్ పొర ప్రాముఖ్యత, పరిరక్షణపైన విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. అకాడమిక్ కో ఆర్డినేటర్ సీహెచ్.భాస్కర్, న్యాక్ కో ఆర్డినేటర్ ఎస్. కవిత, కళాశాల అధ్యాపకులు సరిత, శిరీష, డి.రాధిక, అనిల్, శంకర్, తేజోలత, సుమన్, ఎచ్ రమేష్, ఐలయ్య, లక్ష్మి, షరీఫా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

ములుగు టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ములుగు పట్టణ అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేసిన సందర్భంగా జిల్లా కేంద్రంలో మసీదు సెంటర్ వద్ద కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క చిత్ర పటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ ములుగు పట్టణ కేంద్రంలో ఆధునిక బస్టాండ్ నిర్మా ణానికి, జీవంతరావు పల్లి రోడ్డు నిర్మాణానికి, రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ లాంటి పలు అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క చొరవ చూపి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయించడం హర్షణీయమన్నారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవి యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాంద్ పాషా, ములుగు పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల బిక్షపతి, నాయకులు నల్లెల భరత్, సయ్యద్ షకీల్ అహ్మద్, జక్కుల రేవంత్ తదితరులు పాల్గొన్నారు.